# నిధులు లేక నిలిచిన స్కూల్ భవనం

- మధ్యలోనే పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు


నత్తనడకన ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు

ముషీరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో గతేడాది జనవరి 9న నూతన భవన నిర్మాణానికి విద్యాశాఖ ఉన్నతాధికారులు, అప్పటి మంత్రులు పనులను ప్రారంభించారు. 'మన బడి - మన బస్తీ' పథకంలో భాగంగా జీ ప్లస్ వన్ భవన నిర్మాణానికి రూ.4.5 కోట్ల రూపాయల నిధులు కేటాయించారు. అప్పటి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, డీఈవో రోహిణి, పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. కానీ నేటికీ పూర్తి కాలేదు.

### నిధులు విడుదల చేయకపోవడంతోనే జాప్యం

పాఠశాల భవన నిర్మాణంలో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటి వరకు జీ ప్లస్ వన్ స్లాబ్ వరకు పనులు పూర్తి చేశారు. సుమారు రూ.2 కోట్ల వరకు వెచ్చించినట్లు చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకు నిర్మించిన భవనానికి సంబంధించిన నిధులు విడుదల చేయలేదని కాంట్రాక్టర్ వాపోతున్నారు. చేపట్టిన నిర్మాణ పనులలో సగం నిధులు విడుదల చేసినా పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ పేర్కొంటున్నారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

### ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 515 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల పురాతన భవనాన్ని కూల్చివేయడంతో అదే ప్రాంగణంలోని ప్రాథమిక పాఠశాలలో ఉదయం వేళల్లో విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు సరిపడినన్ని తరగతి గదులు లేకపోవడంతో అటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని ప్రకటించినప్పటికీ పాఠశాల నిర్మాణానికి నిధులు మాత్రం మంజూరు చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పనులను వెంటనే పూర్తి చేయాలని



పాఠశాల భవన నిర్మాణం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. గత రెండేళ్లుగా మా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థులకు స్కూల్‌ను అందుబాటులోకి తేవాలి.

- వీరేశ్ విద్యార్థి తండ్రి

### ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జాప్యం



ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా విద్యాశాఖ ఉన్నతాధికారులు, మంత్రులు పట్టించుకోవడం లేదు. సమస్యను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం.

- సుప్రియానవీన్‌గౌడ్, కార్పొరేటర్

### కలెక్టర్‌కు లేఖ రాశాం



ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశాం. విద్యాశాఖ ఉన్నతాధికారులకు సైతం విజ్ఞప్తి చేశాం. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పాఠశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

## భారతీయ సంప్రదాయాల వైపు ప్రపంచం చూపు


కిషన్‌రెడ్డికి ఫొటో ఫ్రేమ్‌ను బహూకరిస్తున్న నర్సింహచారి

బర్కత్‌పుర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత వైపు చూస్తున్నాయని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన గురుతర బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. శనివారం ఆర్ నర్సింహచారి రూపొందించిన ఫొటోఫ్రేమ్‌ను కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... భారతీయ సాంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రపంచానికి తెలియవచ్చిందని ఆ ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా నర్సింహాచారిని కిషన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో జి.ఆంజనేయచారి, కె.శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్లు

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

అంబర్‌పేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట మండల పరిధిలోని 104 మందికి కల్యాణలక్ష్మి, 78 మందికి షాదీముబారక్ చెక్కులను అలీకేఫ్ చౌరస్తాలోని ఫంక్షన్‌హాలులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బి పద్మ, తహసీల్దార్ వీరబాయి, బీఆర్ఎస్ నేతలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపాల్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కవాడిగూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ అనిల్‌కుమార్‌యదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 285 మంది లబ్ధిదారులకు ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్‌లు జి రచనశ్రీ, కె రవిచారి, సుప్రియా నవీన్ గౌడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, పరిమళ్‌కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎంసి మహేందర్‌బాబు, ఎ ప్రభాకర్ గంగపుత్ర, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డి సాయి కృష్ణ, బీఆర్ఎస్ నేతలు రాకేష్‌కుమార్, ప్రభాకర్, సంతోష్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్, కాంగ్రెస్ నేతలు పి లక్ష్మణ్, వాజిద్‌హుస్సేన్ రమేష్‌యాదవ్, రాము, మేడి సురేష్, బొల్ల రమేష్, అనిల్, పెంటారెడ్డి, రెవెన్యూ అధికారులు, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రేమ్‌నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కమార్‌గౌడ్ డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో పాదయాత్ర శనివారం చేశారు. ప్రేమ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసే సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బస్తీవాసుల సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 7న సీఎం కప్ ప్రారంభం


సోనీబాలదేవిని అభినందిస్తున్న సురేష్, తదితరులు

గోల్నాక, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సీఎం కప్-2024లో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని అత్యున్నత స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పెరిక సురేష్ పిలుపునిచ్చారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గ్రామీ ణ, మండల స్థాయి నుంచి, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు 36 రకాల క్రీడల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కప్–2024 కోసం స్పోర్ట్స్ అథారిటీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీఎం కప్-2024 షెడ్యూల్ ఏకగ్రీవంగా ఆమోదించి ప్రకటించినట్లు చెప్పారు.


పనులు చేపడుతున్న వాటర్‌బోర్డ్ సిబ్బంది

## కలుషిత తాగునీటి సరఫరా పరిష్కారానికి చర్యలు

చిక్కడపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్ బస్తీలో కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్‌కు స్థానికుల ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె స్పందించి హుటాహుటిన బస్తీలో పర్యటించి వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌లతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. స్పందించిన అధికారులు శనివారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, వాటర్‌బోర్డ్ గాంధీనగర్ సెక్షన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తదితరులు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఉమేష్, డి.కుమార్, లక్ష్మణ్, టి.యాదగిరి, జగన్, రామ్మూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి: హైదరాబాద్ సిటీ-1 పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆలిండియా రేడియో పరిధిలోని బ్రాండ్‌లైన్, పోలీస్‌కంట్రోల్ రూమ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, టాటా టెలీసర్వీస్, ఏజీ ఆఫీస్ పరిధిలోని ఇంటెలిజెన్స్ ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్, ఆంధ్రాబ్యాంక్, పట్టాభిభవన్ తదితర ప్రాంతాల్లో 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## కనులపండువగా కార్తీకమాసపూజలు

చిక్కడపల్లి, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పూజల్లో భాగంగా చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు పెద్దఎత్తున హాజరై పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం ఆలయానికి పెద్దఎత్తున భక్తులు చేరుకుని శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ వ్యవస్థాపకవంశీయులు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

చిక్కడపల్లి: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లిలో పోటీపరీక్షల అభ్యర్థులు, పేదలకు అల్పాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ పీఆర్‌వో, డయాబెటిస్‌ఛైర్మన్ డా.జీకే రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకుతోచినరీతిలో సేవా కార్యక్రమం నిర్వహించాలన్నారు.

## టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

కుషాయిగూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. వివిధ గ్రేడ్‌లలో నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలు జనవరి 18, 19 తేదీలలో, షార్ట్‌హ్యాండ్ పరీక్షలు 25వ తేదీన నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 కేంద్రాలలో టైప్ రైటింగ్, 6 కేంద్రాలలో షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తామని సాంకేతిక విద్య, శిక్షణా మండలి కార్యదర్శి ఆకుటి పుల్లయ్య వెల్లడించారు. ఆయా పరీక్షల టైం టేబుల్‌ను కూడా సిద్ధం చేసి గుర్తింపు పొందిన ఇనిస్టిట్యూట్‌ల నిర్వాహకులకు సమాచారం అందజేశామని ఆయన పేర్కొన్నారు. కాగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి అపరాధ రు సుము లేకుండా డిసెంబరు 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, మొదటి సారిటైప్, షార్ట్‌హ్యాండ్ పరీక్షలు రాసే అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన ఇనిస్టిట్యూట్ నుంచి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## మాజీ ఎంపీ కవితను కలిసిన ముఠా జైసింహా

ముషీరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మాజీ ఎంపీ కవిత శనివారం కలిసి పరామర్శించారు. విషయం తెలుసుకున్న ముఠా జైసింహ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిమ్స్ ఆసుపత్రికి చేరుకు కవితతో కలిసి విద్యార్థులను పరామర్శించారు. ఆయన వెంట ముషీరాబాద్ బీఆర్ఎస్ డివిన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, గాంధీనగర్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, సాయిచాణిక్యరెడ్డి తదితరులు ఉన్నారు.

# ఆర్టికల్ 341ని సవరించే బిల్లు పెట్టాలి

**తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి ఛైర్మన్ కోకల కిరణ్ మాదిగ**


నిరాహార దీక్ష కొనసాగిస్తున్న కోకల కిరణ్ మాదిగ

బర్కత్‌పుర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ వర్గీకరణను పటిష్ఠంగా అమలు చేయడానికి ఆర్టికల్ 341ని సవరించే బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి ఛైర్మన్ కోకల కిరణ్‌మాదిగ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి అఖిల పక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్రంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. శనివారం బర్కత్‌పురలోని మహాకూటమి కార్యాలయంలో దండోర ధర్మ పోరాటం అమరణ నిరాహార దీక్ష మూడో రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా కిరణ్‌మాదిగ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లపై ఎస్సీ వర్గీకరణ పటిష్ఠంగా అమలు జరిగే విధంగా ఒత్తిడి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. మాల, మాదిగలను విడదీస్తూ రెచ్చగొడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ వర్గీకరణ పేరుతో మాలలను రెచ్చగొడుతున్నాడని ఆయన ఆరోపించారు. మణిపూర్ వలే మాల, మాదిగలు కొట్టుకునే విధంగా కొంత మంది నేతలు కుట్రలు చేస్తున్నారని, వీటిని తిప్పికొట్టాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకూ తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు.

## ఏడడుగుల బంధాన్ని విడమర్చిచెప్పిన 'ఎనిమిదో అడుగు'


నాటకంలోని ఓ దృశ్యం

చిక్కడపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మూడుముళ్లు, ఏడడుగులు మరచి మరోఅడుగు వేస్తే ఎదురయ్యే పర్యవసానం ఎలా ఉంటుందో తెలియచెప్పింది 'ఎనిమిదో అడుగు' నాటక ప్రదర్శన. భార్యాభర్తల అనుబంధాన్ని గురించి నాటక ప్రదర్శనలో ఎంతో అందంగా చూపించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శివాలయంలో శుక్రవారం రాత్రి శ్రీజయా ఆర్ట్స్ హైదరాబాద్ పర్యవేక్షణలో ప్రదర్శించిన ఈ నాటక ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ సినీనాటక రచయిత మాడభూషి దివాకరబాబు రచించిన ఈ నాటకానికి డా.శ్రీజ సాధినేని దర్శకత్వం వహించడమే కాకుండా ఈ నాటికలో శ్రీముఖి పాత్రలో నటించి అందరి ప్రశంసలు అందుకున్నారు. శంకర్‌నారాయణ పాత్రలో శశిధర్ ఘణపురం, పార్థుగా అవినాష్ పోటాపోటీగా నటించారు. ఏడడుగులు వేసిన జంట ఏ కారణంగానైనా ఎనిమిదో అడుగు వేయాలని ప్రయత్నిస్తే పర్యవసానం ప్రాణాంతకం అవుతుందనేది నాటకం ముఖ్యోద్దేశం. ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే ఆలుమగల మధ్య అంతరాలు సమసిపోయి ఆ బంధం కడదాకా కలిసి ఉంటుందని ఈ నాటక సందేశం. పలువురు కళాకారులు, నాటకప్రియులు పాల్గొని కళాకారులను, తన ముప్పైమూడవ నాటక ప్రదర్శనకు దర్శకత్వం వహించిన శ్రీజ సాధినేనిని అభినందించారు.

### ప్రియాంక చిత్రపటానికి క్షీరాభిషేకం

హైదరాబాద్: వయనాడ్ ఉపఎన్నికలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి ప్రియాంక గాంధీ అత్యధిక మెజారిటీతో విజయం సాధించడంతో పార్టీ నేతలు గాంధీ భవన్‌లో శనివారం సంబరాలు జరిపారు. పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



● ప్రత్యేక పూజలు

ఆర్టీసీక్రాస్ రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో శనివారం సాయంత్రం అనఘాదేవి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

- ఆంధ్రజ్యోతి, చిక్కడపల్లి

## యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

చిక్కడపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌డీ ఫౌండేషనల్ ఆధ్వర్యంలో యువతీయువకులకు నాలుగు నెలల పాటు స్కిల్స్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించనున్నట్లు సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కంప్యూటర్ బేసిక్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఇంటర్నెట్ పరిజ్ఞానం, టైపింగ్‌లపై నిపుణులైన వారితో శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. చిక్కడపల్లి శిక్షణా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏడాదికి 600 మంది యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలను ఇప్పించి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపే యత్నం చేస్తున్నట్లు ఎస్.శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. డిసెంబర్ 1వ తారీకున కొత్త బ్యాచ్ ప్రారంభం కానుండడంతో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువతీయువకులు 80966 66902లో సంప్రదించాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

## ఎనుముల అంటే.. అష్యూరెన్సు! : కిసాన్ కాంగ్రెస్

హైదరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయిన అసహనంలో సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఏదేదో మాట్లాడుతున్నారని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. ఎనుముల అంటే అష్యూరెన్సు అని, భట్టి అంటే బ్రాండ్ అని ఆయన గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎనుముల రేవంత్‌రెడ్డి అంటే.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అంటూ ఖమ్మంలో హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఈ మేరకు స్పందించారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కన్నా ఇప్పటికే 3 లక్షల టన్నులు అదనంగా పత్తి కొనుగోళ్లు జరిగాయని, 12 శాతం తేమ ఉన్నా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. సన్నరకం ధాన్యానికి వారం రోజులుగా బోనస్ పడుతున్నా.. పడట్లేదంటూ హరీశ్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కృషి వల్లనే మత్స్యశాఖకు ఇన్‌ల్యాండ్ ఫిష్ స్టేట్ అవార్డు వచ్చిందని ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయికుమార్ అన్నారు.

## వెస్ట్ మారేడుపల్లిలో ఫుట్‌పాత్‌లపై వ్యాపార సముదాయాల కూల్చివేత

మారేడుపల్లి: రోడ్లకు ఇరువైపులా ఉన్న అక్రమ వ్యాపార సముదాయాల కూల్చివేతలకు జీహెచ్ఎంసీ, కంటోన్మెంట్ బోర్డు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ అధికారులు శ్రీకారం చుట్టారు. వెస్ట్ మారేడుపల్లిలో కొందరు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారి ఏసీపీ సుస్మిత, ఐపీఎస్ అధికారి విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, కంటోన్మెంట్ బోర్డు హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, ఏసీపీ శంకర్ రాజు పర్యవేక్షణలో రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయములను ఎక్సకవేటర్‌తో కూల్చివేయించారు.

## నంబర్‌ప్లేట్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఉన్న హాట్ స్పాట్‌లను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్ సూచించారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో శనివారం ట్రాఫిక్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్, చలాన్లపై దృష్టి తదితర అంశాలపై చర్చించారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలైన డ్రంకెన్ డ్రైవ్, రాంగ్ సైడ్ డ్రైవ్, నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, హెల్మెట్‌లపై కూడా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. రోడ్లపై ఉన్న ఆక్రమణల తొలగింపు, రోడ్డు వెడల్పు చేయడం, జంక్షన్‌లలో డిజిటల్ బోర్డుల ఏర్పాటు, విద్యుత్ స్తంభాల తొలగింపు, పెండింగ్ చలాన్ల వసూళ్లు, ట్రాఫిక్ మార్షల్స్ వినియోగం, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, అక్రమ పార్కింగ్‌పై చర్యలు తదితర అంశాలపై అనుసరించాల్సిన కార్యాచరణను రూపొందించారు. సమావేశంలో ట్రాఫిక్ డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్

## హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న మహిళ అరెస్ట్

దుండిగల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగల కోసం పథకం ప్రకారం మహిళను హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న మహిళను దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న ఉదయం 8 గంటల సమయంలో బహదూర్‌పల్లి కాకతీయ లేఅవుట్-2లో దాదాపు 40-45 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళ హత్యకు గురైందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల దర్యాప్తులో మృతురాలు నిజామాబాద్ జిల్లా, బాన్సువాడ ప్రాంతంలోని సంగమేశ్వరకాలనీకి చెందిన నాగయ్య భార్య అంజమ్మ(44)గా గుర్తించారు. అదే ప్రాంతానికి చెందిన పాత నేరస్తురాలు బూసిబోయిన గంగామణి(40) ఒక పథకం ప్రకారం బంగారు నగలు, సిల్వర్ వస్తువులను దొంగిలించడానికి అంజమ్మను బహదూర్‌పల్లి ప్రాంతంలోని తమ బంధువుల ఇంటికి వెళ్దామని తీసుకువచ్చింది. అనంతరం కాకతీయ లేవుట్‌లో హత్య చేసి, నగలు దొంగిలించి పారిపోయింది. కేసునమోదు చేసిన పోలీసులు నిందితురాలిని సీసీ టీవీ, ఆర్టీసీ జీరో బస్ టిక్కెట్ ఆధారంగా గుర్తించి శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ పీ.సతీష్, డీఐ.బి.సతీష్ పాల్గొన్నారు.

## రైలులో నగలు, నగదు చోరీ

**మరో ఘటనలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో..**

బర్కత్‌పుర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి నుంచి బంగారు ఆభరణాలు, నగదును దొంగలు తస్కరించారు కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన యోగానందరెడ్డి భార్య అరుణ కుమారి(55) సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వచ్చింది. రైలు దిగి చూసుకున్న తర్వాత బ్యాగులో ఉండాల్సిన 43 గ్రాముల బంగారు ఆభరణాలు, పదివేల రూపాయల నగదు కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన అరుణకుమారి శనివారం సాయంత్రం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో మరో ఘటన.. నగరంలోని మణికొండ ప్రాంతానికి చెందిన శివకుమార్ కుమారుడు కే కిరణ్‌కుమార్(43) తిరుపతి నుంచి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడకు వచ్చాడు. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు రైలు చేరుకున్న తర్వాత బ్యాగులో ఉన్న 12 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో కిరణ్‌కుమార్ కాచిగూడ రైల్వే పీఎస్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు

# పెద్దపిల్లల్ని దత్తత తీసుకోవాలి: భావనాసక్సేన



పెద్ద పిల్లల దత్తత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భావనాసక్సేనా తదితరులు

యూసుఫ్‌గూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిల్లల్ని పెంచుకోవలనుకునే తల్లిదండ్రులు చిన్న పిల్లలనే కాకుండా పెద్దపిల్లలను కూడా చట్టబద్ధంగా దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సీఏఆర్ఏ) సీఈఓ బావనాసక్సేనా అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ నిమ్స్‌మే ఆడిటోరియంలో తెలంగాణ ప్రభుత్వ ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దత్తత మాసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'పెద్ద వయసు పిల్లల దత్తత' అనే అంశంపై ఆమె మాట్లాడారు. పిల్లల్ని పెంచుకోవాలనే తల్లిదండ్రుల్లో 95 శాతం మంది 0-6 సంవత్సరాల లోపు చిన్నారులను దత్తత తీసుకునేందుకు ఇష్టపడుతున్నారన్నారు. కానీ 6 నుంచి 13 సంవత్సరాలు, 13 నుంచి 19 సంవత్సరాల వారిని కూడా దత్తత తీసుకునే విధంగా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ ఉద్యోగి బాధ్యతగా తీసుకుని దత్తత విధానాన్ని మరింత సరళతరమయ్యే విధంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీధి బాలలను కూడా చట్టబద్ధ దత్తత విధానంలోకి తీసుకురావాలని ఆమె సూచించారు. రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ స్నేహ జొన్నలగడ్డ మాట్లాడుతూ వేరే పిల్లల్ని దత్తత తీసుకుని పెంచటం అనేది ఎంతో ఉత్తమమైన కార్యక్రమం అన్నారు. దత్తత కోసం విదేశాల నుంచి కూడా ఎందరో వస్తున్నారని, అలాంటి సందర్భాల్లో పిల్లలకు పాస్‌పోర్ట్ అవసరం ఉంటుందని, వారికి వెంటనే పాస్‌పోర్ట్ ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా 'పెద్ద వయసు పిల్లల దత్తత' పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ ఆఫ్ ఉమెన్ డెవలప్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఎ.కాంతివెస్లీ, ఎస్‌సీసీసీఆర్ ప్రతినిధులు అపర్ణ, అంజనారావు పాల్గొన్నారు.